క్లుప్తంగా

కుంభాభిషేకం..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ చైతన్యనగర్ ఎన్‌టీఆర్ బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ ధర్మశాస్తా (అయ్యప్ప స్వామి) దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా బుధవారం అయ్యప్పస్వామి దేవాలయం తలుపులు తెరిచి భక్తులకు నిర్మాల్య దర్శనం అందించారు. తర్వాత మహాగణపతి హోమం, ఉష పూజ, అర్ధ సహస్ర కలశాభిషేకం, హోమ కలశాభిషేకములు, ధ్వజస్తంభం, పదినెట్టాంబడులకు ప్రాణ ప్రతిష్ఠ, కుంభాభిషేకం వంటి పూజలు జరిపారు.

వసతిగృహాల తనిఖీ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు వసతి గృహాలను ఆహార తనిఖీ అధికారులు ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు. బుధవారం నగరంలోని ఎస్సీ గురుకుల, ఎస్టీ కళాశాల వసతి గృహాలను అధికారులు సందర్శించి వంటశాలలోని ఆహార పదార్థాలు, కూరగాయలను పరిశీలించారు. ఒకటి, రెండు వసతి గృహాల్లో నిల్వ ఉంచిన సరుకులు నాణ్యత లేనట్లుగా అధికారులు గుర్తించినట్లు తెలిసింది. నగరంతో పాటు జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తామని వారు వెల్లడించారు.

సేవ చేయడంలోనే సంతృప్తి


వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

తిరుమలాయపాలెం: సమాజ సేవకు దాతలు ముందుకు రావాలని, సేవ చేయడంలోనే సంతృప్తి దొరకడంతో పాటు ప్రజల మన్ననలు పొందుతారని తహసీల్దార్ పి.వి రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన కాంపాటి బాబురావు తన తల్లిదండ్రులైన కాంపాటి వీరస్వామి, పిచ్చమ్మల జ్ఞాపకార్థం రూ.8 లక్షల విలువైన వైకుంఠ రథం వాహనాన్ని పిండిప్రోలు గ్రామ పంచాయతీకి అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడగా.. గ్రామ పంచాయతీ ఆధ్వర్యాన అధికారులు బాబురావు, ప్రమీల దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, పంచాయతీ కార్యదర్శి సుజాతతో పాటు ఆనందరావు, శ్రీనివాసరావు, సుధాకర్, పరికపల్లి చంద్రశేఖర్, చామకూరి వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల స్థలం పరిశీలన


స్థల మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్‌లో నూతనంగా నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల నిర్మాణ స్థలాన్ని టీజీఈడబ్ల్యూడీసీ ఎండీ షఫీమియా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విన్సెంట్‌రావులు బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం ఒక్కో పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు నిధులు కేటాయించడంతో వారు పాఠశాల నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈమేరకు మొత్తం 21 ఎకరాలు అవసరం ఉంటుందని తహసీల్దార్ పి.రాంప్రసాద్ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు ప్రసాద్, క్రాంతి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ మేనేజర్‌కు అవార్డు

కూసుమంచి: కూసుమంచి ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ వడిత్య సురేందర్‌కు ఉత్తమ బ్యాంకింగ్ సేవలు అందించినందుకు గానూ రాష్ట్రస్థాయిలో సీజీఎం ఆధ్వర్యాన హైదరాబాద్‌లో బుధవారం అవార్డు లభించింది. మండలంలోని లోక్యాతండాకు చెందిన సురేందర్ గత రెండున్నర ఏళ్లుగా మేనేజర్‌గా విధులు నిర్వహించగా.. అవార్డు లభించడంతో పలువురు అభినందనలు తెలియజేశారు.

ఎస్సెస్సీ పరీక్షలకు 236 మంది..

● రఘునాథపాలెం: ఈనెల 21న మొదలుకానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు రఘునాథపాలెం మండలం నుంచి 236 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఎంఈఓ రాములు తెలిపారు. మంచుకొండ, కోయచలకలో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో పరీక్షలు ఉదయం 9–30 నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు జరుగుతుండగా.. ఉదయం 9–35 గంటల వరకు లోనికి అనుమతి ఉంటుందని తెలిపారు. కాగా, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

● నేలకొండపల్లి: మండలంలోని నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం, చెరువుమాధారంలో ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ బి.చలపతిరావు తెలిపారు. ఆయా కేంద్రాల్లో 456 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, 232 మంది బాలికలు, 224 మంది బాలురు ఉన్నారని పేర్కొన్నారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి చేరుకోవాలని సూచించారు.

గాడిన పడని మున్సిపాలన

పేరుకే ఏదులాపురం మున్సిపాలిటీ

- మున్సిపల్ కార్యాలయ అడ్రస్‌లో గందరగోళం
- ఎప్పుడు ఏ అధికారి ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి
- పేరుకుపోయిన ఇంటి పన్ను బకాయిలు
- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- సిబ్బందిపై అజమాయిషీ కరువు


వివిధ పనుల కోసం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పడి రెండు నెలలు కావొస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా సమస్యలు దర్శనమిస్తున్నాయి. గత నెల 6న ఖమ్మంరూరల్ మండలం నుంచి 12 గ్రామ పంచాయతీలను వేరు చేసి ఏదులాపురం నూతన మున్సిపాలిటీని ఏర్పాటు చేసిన విషయం విదితమే. అప్పటి నుంచి అధికారికంగా మున్సిపల్ పాలన ప్రారంభమైనప్పటికీ ఇంతవరకు ప్రజలకు అవసరమైన సేవలు అందించడం, వారి అవసరాలు తీర్చే నాథుడే కరువయ్యారు. మున్సిపాలిటీ ఏర్పడగానే ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌ను ఏదులాపురం ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమించింది. అప్పు నుంచి ఈనెల 16 వరకు ఆయన అందుబాటులో లేకపోవడం, కార్యాలయానికి చుట్టపు చూపుగా రావడం, ప్రజలు పలు పనుల కోసం కార్యాలయం చుట్టూ తిరగడం షరా మామూలే అయింది. ప్రస్తుతం, గతంలో ఉన్న గ్రామపంచాయతీ కార్యదర్శులే ఆయా వార్డుల అధికారులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, ఇటీవల నూతన కమిషనర్‌గా ఆళ్ల శ్రీనివాసరెడ్డిని నియమించగా ఈ నెల 17న ఆయన విధుల్లో చేరారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

ఇదిలా ఉండగా మున్సిపల్ పరిధిలోని 12 గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తున్నాయి. అప్పటి పంచాయతీల పాలన కంటే ఇప్పుడు పెద్దగా మెరుగ్గా ఏమీలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏదులాపురం, పెదతండా లాంటి పెద్ద వార్డుల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా దర్శనమివ్వడంతో ఆయా వార్డుల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కాగా, పెదతండా వార్డు కార్యాలయం పక్కనే ఉన్న వీధి ప్రజలకు గత నెలరోజులుగా తాగునీరు సరఫరా కాక మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి దాహం తీర్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టక వీధులన్నీ దుర్వాసనతో నిండి ఉన్నాయి. అయితే పారిశుద్ధ్య పనులకు మున్సిపల్ శాఖ నుంచి నిధులు రావడంలేదని, అందుకు సంబంధించి ఇంకా ఖాతాలే తెరవలేదని, పాత పంచాయతీల్లో ఉన్న నిధులతోనే నెట్టుకొస్తున్నట్లు వార్డు అధికారులు పేర్కొనడం విశేషం.

ఊసేలేని అనుమతి పత్రాలు

మున్సిపాలిటీలో ప్రజలకు అత్యవసరమైన ఇంటి అనుమతి, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ వంటి కార్యకలాపాలు ఇంతవరకు ఊసేలేదు. అసలు మున్సిపల్ కార్యాలయం ఎక్కడ ఉందనే విషయం చాలామంది ప్రజలకు తెలియకపోవడం విశేషం. మొదటగా ఏదులాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయగా.. అధికారులు చుట్టపుచూపుగా వచ్చేవారు. ఈలోగా పారిపాలనా సౌలభ్యం కోసమంటూ పెదతండా గ్రామపంచాయతీ కార్యాలయానికి మకాం మార్చడంతో ఏదులాపురం వెళ్లాలో లేక పెదతండా వెళ్లాలో.. అధికారులు ఎక్కడ ఉంటారో ఇప్పటికీ స్పష్టత లేకపోవడంతో గందరగోళం నడుమ ప్రజలు అయోమయంలో ఉన్నారు.

అడ్రస్ లేని వార్డు అధికారులు

మున్సిపాలిటీ పరిధిలోని 12 గ్రామపంచాతీల్లో ఒక్కో పంచాయతీకి ఒక్కో కార్యదర్శి ఉండగా వారినే తాత్కాలికంగా మున్సిపల్ వార్డు అధికారులుగా వ్యవహరించేలా ఉన్నతాధికారులు మున్సిపల్ బాధ్యతలు అప్పగించారు. అయితే వీరు ఆయా కార్యాలయాలకు ఎప్పుడు వస్తారో, ఎటు వెళ్తున్నారో, ఏ సమయానికి ప్రజలకు అందుబాటులో ఉంటారో ఎవరికీ తెలియదు. వారు వచ్చినప్పుడే లెక్క, వారు చేసిందే పని అన్నట్లుగా ప్రస్తుత మున్సిపల్ వార్డు అధికారుల పనితీరు ఉందనే విమర్శలున్నాయి. అదే విధంగా మున్సిపాలిటీకి కేటాయించిన ప్లానింగ్ ఆఫీసర్ మున్సిపల్ ఇంజనీర్, అకౌంట్స్ ఆఫీసర్ ఎక్కడుంటారో, ఎలా ఉంటారో కూడా ప్రజలకు తెలియని దుస్థితి నెలకొంది.

కమిషనర్‌ను కలిసేందుకు బారులు

ఖమ్మంరూరల్: ఏ కార్యాలయానికైనా నూతన ఉన్నతాధికారి విధుల్లో చేరితే అక్కడి సహచర ఉద్యోగులు మార్యాదపూర్వకంగా కలవడం, సన్మానాలు చేసి అభినందనలు తెలపడం షరా మామూలే. కానీ ఏదులాపురం మున్సిపాలిటీ కమిషనర్‌గా నియమితులైన ఆళ్ల శ్రీనివాసరెడ్డిని కలిసేందుకు అధికార, విపక్షాలకు చెందిన నాయకులు పోటీపడుతున్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలు చెప్పుకునే చాన్సే లేకుండా వారు కార్యాలయ ఆవరణను చుట్టేస్తున్నారు. ఇదంతా చూసిన ప్రజానీకం ఇంతటి శ్రద్ధ ప్రజా సమస్యలపై చూపిస్తే కొంతమేరకైనా సమస్యలు తీరేవి కదా కదా అంటూ గుగుసలాడుకుంటున్నారు.



పెదతండాలో ఏర్పాటు చేసిన కార్యాలయం

పేరుకుపోయిన ఇంటి పన్ను బకాయిలు..

మున్సిపల్ పరిధిలోని రూ.కోట్లల్లో ఇంటి పన్నుల బకాయిలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరి ఇంతపెద్ద మొత్తంలో పేరుకుపోయిన బకాయిలను వసూళ్లు చేసే బాధ్యత నూతన మున్సిపల్ కమిషనర్‌పై ఉంది. ఒకవైపు ఆర్థిక సంవత్సరం తరుముకొస్తుండడం, మరోపక్క ఈ నెలాఖరు నాటికి వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాల్సిందేనని పైఅధికారుల ఆదేశాలు జారీ చేయడం, అలసత్వం ప్రదర్శించిన సిబ్బందిపై చర్యలు తప్పవని చెప్పడంతో పన్నుల వసూళ్లు సవాల్‌గానే మారింది. ఇప్పటికైనా మున్సిపల్ సమస్యలపై కమిషనర్ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లక్ష్యం మేరకు వసూలు

తాగునీరు, పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశాం. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన డిజిటల్ కీ కొద్ది గంటల్లోనే అందుబాటులోకి వస్తుంది. తర్వాత వెంటనే పత్రాలు మంజూరు చేస్తాం. ఇంటి పన్నులను కూడా ప్రత్యేక సిబ్బందితో లక్ష్యం మేరకు వసూలు చేస్తాం.

– ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కమిషనర్

'ఆరు గ్యారంటీల తరహాలోనే రాష్ట్ర బడ్జెట్'

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇచ్చిన ఆరు గ్యారంటీల తరహాలోనే ఉందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్ గౌడ్ ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్ బకాయిలపై చర్చ లేదని, ప్రభుత్వ విద్యను దూరం చేసేందుకు బడ్జెట్ ఒక ఉదాహరణ అన్నారు.

విద్యారంగానికి అరకొర నిధులు

ఖమ్మం మామిళ్లగూడెం: బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన అరకొర నిధులతో విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ విమర్శించారు. బుధవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టోలో కనీసం 15% నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ గత సంవత్సరం ఈ సంవత్సరానికి 0.2% మాత్రమే కేటాయించడం దారుణమని, తక్షణమే 30% అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు కౌశిక్, జిల్లా నాయకులు మనోజ్, గణేష్, ప్రతాప్, గోపి, సాయి పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతుల దహనం


బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించి విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆరోపిస్తూ బుధవారం మండలంలోని బచ్చోడులో పీడీఎస్‌యూ ఆధ్వర్యాన బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకులు తిమ్మిడి రఘు మాట్లాడగా.. కార్యక్రమంలో నాయకులు వేణు, అఖిల, అంజలి, ఉపేందర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహించొద్దు


మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ఒక్కో బృందంలో వార్డు ఆఫీసర్లు, ఇతర సిబ్బందితో పాటు జిల్లా అధికారులు పర్యవేక్షనున్నట్లు తెలిపారు. బుధవారం కేఎంసీ కార్యాలయంలో జిల్లా అధికారులతో, సర్వే సిబ్బందితో వేర్వేరుగా సమావేశమయ్యారు. హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు సర్వేలో అనుసరించాల్సిన పద్ధతులను సిబ్బందికి వివరించారు. సమాచారం ఎలా సేకరించాలి, లబ్ధిదారులను ఎలా గుర్తించాలనే అంశాలను తెలిపారు. ఈ సందర్భంగా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో నిర్లక్ష్యం వహించొద్దని, ఇచ్చిన జాబితా ప్రకారం.. వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించాక ఫొటోలు దిగాలన్నారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించేలా సర్వేలో ఎటువంటి తప్పులకు తావివ్వొద్దని సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వారికే పథకం వర్తించేలా ఎంపికలు చేయాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐలకు షోకాజ్ నోటీసులు..

నగరంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించడంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు(ఎస్ఐ) అలసత్వం ప్రదర్శిస్తున్నారని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య పనులు జరుగుతున్న తీరును కూడా పరిశీలించడం లేదని, దీంతో నగరంలో రోడ్ల వెంట వ్యర్థాలు ఉంటున్నాయని, శుభ్రం చేయించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని దీన్ని ఉపేక్షించమని పేర్కొన్నారు. ట్రేడ్ లైసెన్సు ఫీజుల వసూళ్లలో కూడా తీవ్ర నిర్లక్ష్యంగా ఉన్నారని, వెంటనే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తమ తీరు మార్చుకోవాలని ఆదేశించారు. ఆతర్వాత కె.మల్లయ్య, ఎస్.ఎల్లస్వామి, జె.భీమయ్యలకు షోకాజ్ నోటీసులను జారీ చేశారు.

సీపీఆర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్


మాట్లాడుతున్న చంద్రమోహన్

ఖమ్మం మామిళ్లగూడెం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన బుధవారం ఖమ్మం మహాత్మా జ్యోతిరావు పూలే డిగ్రీ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం హార్ట్ ఎటాక్ వచ్చిన సమయాన ఎలా రికవరీ చేయాలో ట్రైనర్ డాక్టర్ నరసింహారావు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్, రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరీ సూర్యప్రకాష్‌రావు, జి.నాగేశ్వరరావు, తాత రాఘవయ్య, అధ్యాపకులు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యులపై చట్టరీత్యా చర్యలు

ఖమ్మంరూరల్: మండలంలోని తీర్థాల గ్రామానికి చెందిన పాలేరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిరణ్‌కుమార్‌పై దాడి చేసిన బీఆర్ఎస్ వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కిరణ్‌కుమార్‌ను ఆయన పరామర్శించారు. అనంతరం మంగళగూడెంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస పార్టీ సీనియర్ నాయకుడు బి.శ్రీనివాసరావు కుటుంబాన్ని మంత్రి పరామర్శించి సానుభూతి ప్రకటించారు.

మహిళా డిగ్రీ కళాశాలలో విస్మృతోపన్యాసం

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు, ఉపాధ్యాయులు సరళంగా ఒత్తులు లేకుండా, ఒత్తిడి లేకుండా రాయడానికి, చదవడానికి ఆస్కారం ఉన్న భాష తెలుగు భాష అని భాషా పరిశోధకుడు చంద్రగిరి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యాన 'తెలుగు లిపి సరళత ఒత్తులు లేని తెలుగు' అనే అంశంపై విస్మృతోపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడగా.. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయాన్ని విద్యాశాఖకు అప్పగించాలి

రఘునాథపాలెం: మండల కేంద్రమైన రఘునాథపాలెంలో విద్యా వనరుల కేంద్రం(ఎంఈఓ) కార్యాలయంలో డీఆర్‌డీఏకు చెందిన ఐకేపీ వారు నిర్వహిస్తున్నారని, తక్షణమే వారిని ఖాళీ చేయించి విద్యాశాఖకు కేటాయించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు బుధవారం డీఆర్‌డీఓకు వినతిపత్రం సమర్పించారు. తొలుత ఇటీవల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించటంపై డీఈఓ సోమశేఖరశర్మ, ఎస్‌టీఓ వేల్పాద్రి తదితరులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రఘునాథపాలెం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుర్రం కేశవరావు, తూమాటి సైదుబాబు, ఖమ్మం అర్బన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుడి శ్రీనివాసరావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.


డీఆర్‌డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఘనంగా వీడ్కోలు

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: నగరంతో పాటు రఘునాథపాలెం మండలంలోని పలు పాఠశాలల్లో ఎస్సెస్సీ విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సభలు నిర్వహించారు. ఈమేరకు కైకొండాయిగూడెం పాఠశాలలో హెచ్‌ఎం శ్రీదేవి, రఘునాథపాలెం పాఠశాలలో హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లు, వేపకుంట్ల పాఠశాలలో హెచ్‌ఎం నారాయణ తదితరులు విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారు. అనంతరం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, ఇతర సామగ్రి దాతలు అందించారు.

వితరణలు

● విద్యార్థులకు స్టడీ చైర్లు..


స్టడీ చైర్, ప్యాడ్ అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంఅర్బన్: నగరంలోని పాండురంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు లయన్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన బుధవారం స్టడీ చైర్లతో పాటు ప్యాడ్లను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షులు బొల్లికొండ శ్రీనివాసరావు, ప్రతినిధులు గెల్లా శ్రీరామ్, గోంగూర వెంకటేశ్వర్లు, డీపీసీ రావు, విశ్వేశ్వరరావు, వెంకయ్య, కృష్ణమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేష్, దత్త తదితరులు పాల్గొన్నారు.

● పరీక్ష ప్యాడ్లు..

ఖమ్మం మామిళ్లగూడెం: గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ పట్టణ శాఖ ఆధ్వర్యాన బుధవారం ఖమ్మం తెలంగాణ మైనారిటీ గురుకుల బాలికల2 పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ రీజినల్ ఆర్గనైజర్ హఫ్సా మేహ్వీన్, అసిస్టెంట్ రీజినల్ ఆర్గనైజర్ ఖదీజా తుల కుబ్రాలు మాట్లాడగా.. కార్యక్రమంలో మైనారిటీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మీతో పాటు రేష్మా, ఆయిషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్ఐ, తదితరులు

ఖమ్మంఅర్బన్: ఆడపిల్లలకు జన్మనిచ్చిన మెకానిక్ కుటుంబాలకు ఖమ్మం కార్పొరేషన్ టూవీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యాన ఆర్థిక సాయం అందించినట్లు యూనియన్ అధ్యక్షుడు వంగాల కొండలరావు తెలిపారు. ఈమేరకు బుధవారం యూనియన్‌లో సభ్యత్వం కలిగిన మెకానిక్‌లు ఖదీర్‌పాషా, యాకుబ్‌పాషా, వేణు, సాంబలకు రూ.10వేల చొప్పున ట్రాఫిక్ ఎస్ఐ సాగర్ చేతుల మీదుగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మం, అన్వర్, మురళి, అనిల్, లాలయ్య, శేషు, వెంకటేష్, సుభాని, అంబాస్, నరేష్, ముస్తాఫా, తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల ఆమోదంపై పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేలకొండపల్లి/ఖమ్మంవన్‌టౌన్: గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకుందని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు ఆరోపించారు. బిల్లులు ఆమోదం పొందిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్ర పటాలకు బుధవారం పాలాభిషేకం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, మాజీ ఎంపీపీ రమ్య, నాయకులు జెర్రిపోతుల అంజిని, వంగవీటి నాగేశ్వరరావు, మైశా శంకర్, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, సూరేపల్లి రామారావు, కడియాల నరేష్, గుండా బ్రహ్మం, మార్తి కోటి, మోర మల్లయ్య, కైలాసపు వెంకటేష్, ఐతనబోయిన శ్రీనివాసరావు, జెర్రిపోతుల సత్యనారాయణ, కోటేశ్వరరావు, రాయపూడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేయడంపై ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకుడు శెట్టి రంగారావు బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

కవిత ముందస్తు ఆలోచనతోనే బీసీ రిజర్వేషన్ బిల్లులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎమ్మెల్సీ కవిత ముందస్తు ఆలోచన మేరకే రాష్ట్ర ప్రభుత్వం రెండు బీసీ బిల్లులను ప్రవేశ పెట్టిందని బీసీ సంఘం సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ అన్నారు. బీసీ బిల్లు ప్రవేశపెట్టిన నేపథ్యాన బుధవారం ఎస్‌బీఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లు ప్రవేశ పెట్టి చేతులు దులుపుకోకుండా కేంద్ర ప్రభుత్వం బిల్లును అమలు చేసేలా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు కూరాకుల నాగభూషణం, పగడాల నరేందర్, కోడి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడిన సంగయ్య..


సంగయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: తుది శ్వాస వరకు కార్మికుల హక్కుల కోసం పోరాడిన మేకల సంగయ్య ధన్యజీవి అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. మేకల సంగయ్య 9వ వర్ధంతి సందర్భంగా గిరిప్రసాద్ భవన్‌లో సంగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగిన ఈ సభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ.. అమరుల వారసత్వాన్ని కొనసాగిస్తూ భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సభలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గసభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి..

నగరంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం నూనె శశిధర్ అధ్యక్షతన సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో తాగునీరు, డ్రెయినేజీ, అంతర్గత రోడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉపాధి హామీ పథకంలో పట్టణ పేదలను భాగస్వామ్యం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నగర కార్యదర్శి ఎస్‌కె.జానిమియా, మహ్మద్ సలాం, బీజీ క్లైమెంట్, పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ధర్నా

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సీఐటీయూ నాయకుడు కె.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లను పర్మినెంట్ చేసి, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశాల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడంలేదని, త్వరలోనే ధర్నా చేయనున్నట్లు తెలిపారు. నాయకులు రమ్య, శీలం నర్సింహారావు, ఎస్.నవీన్‌రెడ్డి, రాములు, వీరన్న, మంగమ్మ, అమల, రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాచౌక్‌లో నిరసన వ్యక్తం చేశారు.

మల్లు స్వరాజ్యం వర్ధంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

కూసుమంచి: తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా బుధవారం కూసుమంచిలోని సీపీఎం కార్యాలయంలో పలువురు నాయకులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె పేద, బడుగు, బలహీన వర్గాల తరఫు చేపట్టిన పోరాటాలను శ్లాఘించారు. నాయకులు మల్లెల సన్మంతరావు, తోటకూరి రాజశేఖర్, శీలం గురుమూర్తి, బిక్కసాని గంగాధర్, తాళ్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.